క్లుప్తంగా

ప్రశాంతంగా పాలిసెట్



నందిగామ: పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష-2024 శనివారం ప్రశాంతంగా ముగిసింది. నందిగామలో పాలిసెట్ కోసం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, డీవీఆర్ జూనియర్ కాలేజీ, ఎంఆర్ఆర్ కాలేజీ, శ్రీవిద్య పాఠశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,505 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 1,281మంది హాజరైనట్లు నందిగామ ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ ఎం.రమేష్‌బాబు తెలిపారు. 224మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగగా, పరీక్షా కేంద్రాల పర్యవేక్షకులుగా బి.కళ్యాణ్, ప్రసాద్‌బాబు వ్యవహరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో పోలీసు కవాతు




చందర్లపాడు(నందిగామ): ఓటర్లంతా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో ధైర్యాన్ని పెంపొందించేందుకు పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు నందిగామ రూరల్ సీఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. చందర్లపాడు మండలంలోని రామన్నపేట, మునగాలపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో శనివారం సాయంత్రం ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశాలలో రూరల్ సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. చందర్లపాడు ఎస్‌ఐ ఆర్.ధర్మరాజు, ప్రత్యేక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ నమోదుపై సమీక్ష



నందిగామ: నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ తూర్పు నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు మదన్ కుమార్ శనివారం నందిగామను సందర్శించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ రవీంద్రరావు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నందిగామ నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల ప్రచార ఖర్చులను లెక్కించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై సమీక్షించారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నమోదు చేసే విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



నందిగామ: వేసవి నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని ఎంపీపీ ఆకుల హనుమంతరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వేసవికాలం గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన చర్యలు, బోర్ల మరమ్మతులు తదితర అంశాలపై సభ్యులయ చర్చించారు. పారిశుధ్యం నిర్వహణ, మౌలికవసతుల కల్పనపై వారు సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ పనిచేయని బోర్లను గుర్తించి, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ గాదెల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే కీలకం

నందిగామ: గత ఎన్నికల మాదిరే ఈసారి కూడా నందిగామ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈసారి నియోజకవర్గంలో మొత్తం రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉండగా వారిలో లక్ష పైచిలుకు మహిళా ఓటర్లే ఉండటం గమనార్హం. నియోజకవర్గంలో ప్రస్తుతం 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం ఓటర్లు 2,05,480మంది ఉన్నారు. వీరిలో పురుషులు 99,398మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,06,076మంది, థర్డ్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నారు. వీరుగాక సర్వీసు ఓటర్లు 41మంది ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

నందిగామ నియోజకవర్గంలో నందిగామ మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాలు ఉండగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ మండలంలో మొత్తం 23,489మంది ఓటర్లు ఉండగా, పురుషులు 11,399మంది, మహిళలు12,089మంది ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు. నందిగామ పట్టణ పరిధిలో మొత్తం 36,492 మంది ఓటర్లు ఉండగా పురుషులు 17,464 మంది, మహిళలు 19,026 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు ఇద్దరు ఉన్నారు. చందర్లపాడు మండలంలో మొత్తం 49,019 మంది ఓటర్లు ఉండగా పురుషులు 23,958మంది, మహిళలు 25,060మంది, థర్డ్ జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు

వీరులపాడు మండలంలో మొత్తం 40,414మంది ఓటర్లు ఉండగా, పురుషులు 19,517మంది, మహిళలు 20,896 మంది, థర్డ్ జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు. కంచికచర్ల మండలంలో మొత్తం 56,066 మంది ఓటర్లు ఉండగా పురుషులు 27,060మంది, మహిళలు 29,005మంది, థర్డ్ జెండర్ ఓటరు ఒకరు ఉన్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు(ఫైల్)



నందిగామ నియోజకవర్గ మ్యాప్

పదివేలకుపైగా పెరిగిన ఓటర్ల సంఖ్య..

2019 ఎన్నికల సమయంలో నందిగామ నియోజకవర్గంలో మొత్తం 1,95,011 ఓట్లు ఉండగా ఈసారి ఓటర్ల సంఖ్య 2,05,480కు పెరిగింది. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికలకు పదివేల మందికిపైగా ఓటర్లు పెరిగారు. 2019లో పురుష ఓటర్లు 99,361మంది ఉండగా, మహిళా ఓటర్లు 95,642మంది ఉన్నారు. గత ఎన్నికల్లో పురుష ఓటర్ల కంటే అధికంగా మహిళా ఓటర్లు 3,719మంది ఉండగా, ఈసారి కూడా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 6,678మంది అధికంగా ఉన్నారు. థర్డ్ జెండర్ ఓట్లు గతంలో ఎనిమిది ఉండగా, ఈసారి ఆసంఖ్య ఆరుగురికి తగ్గింది. నియోజకవర్గంలో ఈసారి 18 ఏళ్ల వయస్సు నిండిన 4289మంది యువతీయువకులకు నూతనంగా ఓటుహక్కు పొందారు.

జగ్గయ్యపేటలోనూ మహిళా ఓటర్లదే పైచేయి

పెనుగంచిప్రోలు:జగ్గయ్యపేట నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నిలక వరకు మహిళా ఓటర్లు కీలకంగా మారారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్లు 2,05,364 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 99,463మంది, మహిళలు 1,06,888 మంది థర్డ్ జెండర్ ఓటర్లు 13మంది ఉన్నారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,96,968 మంది ఉండగా పురుషులు 94,936 మంది, మహిళా ఓటర్లు 1,02,021 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 11మంది ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి 8396మంది ఓటర్లు పెరిగగా, గత ఎన్నికలతో పోల్చితే మహిళా ఓటర్లు 8867మంది అధికంగా ఉన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇటీవల 18ఏళ్ల వయస్సు నిండిన 5,861మంది యువత ఈసారి కొత్తగా ఓటుహక్కు పొందారు. థర్డ్‌జెండర్ ఓటర్ల సంఖ్య గతంలో 11 ఉండగా ఆసారి ఆసంఖ్య 13కు పెరిగింది.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో జగ్గయ్యపేట పట్టణంతోపాటు జగ్గయ్యపేట, వత్సవాయి. పెనుగంచిప్రోలు మండలాలు ఉన్నాయి. జగ్గయ్యపేట పట్టణంలో మొత్తం ఓటర్లు 43675 మంది ఉండగా పురుష ఓటర్లు 20521 మంది, మహిళా ఓటర్లు 23148మంది, థర్డ్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉన్నారు. జగ్గయ్యపేట మండలంలో మొత్తం 54436మంది ఓటర్లు ఉండగా పురుషులు 26228మంది ఉండగా, మహిళలు 28204మంది, థర్డ్ జెండర్ ఓటర్లు నలుగురు ఉన్నారు. వత్సవాయి మండలంలో మొత్తం 50017మంది ఓటర్లు ఉండగా, పురుషులు 24060మంది ఉండగా, మహిళలు 25957మంది ఉన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 41815మంది ఉండగా, పురుష ఓటర్లు 20192మంది, మహిళా ఓటర్లు 21620మంది, థర్డ్‌జెండర్ ఓటర్లు ముగ్గురు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో మొత్తం ఓటర్లు 15421మంది ఓటర్లు ఉండగా, పురుషులు 7462మంది, మహిళా ఓటర్లు 7959మంది ఉన్నారు .



జగ్గయ్యపేట నియోజకవర్గ మ్యాప్

5,861మంది కొత్త ఓటర్లు..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇటీవల 18ఏళ్ల వయస్సు నిండిన 5,861మంది యువతీయువకులు తాజా ఓటర్ల జాబితాలో ఓటుహక్కు పొందారు. జగ్గయ్యపేట పట్టణంలో నూతనంగా 1318మంది యువతీయువకులు ఓటుహక్కును పొందారు. జగ్గయ్యపేట మండలంలో 1637మంది, వత్సవాయి మండలంలో 1401మంది, పెనుగంచిప్రోలు మండలంలో 1128మంది, జగ్గయపేట నియోజకవర్గ పరిధి ఉన్న నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో 377మంది యువతీయువకులు నూతనంగా ఓటుహక్కును పొందారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగింపు సాధ్యమని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను పేర్కొన్నారు. అందుకే సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదోవార్డు తొర్రగుంటపాలెంలో వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌తో కలసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులను వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి విజయవాడ ఎంపీగా గా కేశినేని శ్రీనివాస్(నాని), జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఉదయభానుకు వార్డు మహిళలు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో సుపరిపాలన అందించారన్నారు.సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చారన్నారు. వలంటరీ వ్యవస్థను రూపొందించి లంచాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. మంచి జరిగితేనే ఓటు వేయమని ధైర్యంగా ఓటు అడుగుతున్న ఏకైక పార్టీ తమ వైఎస్సార్ సీపీనేనన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజలకు మంచిచేయడమే ఈ ధైర్యానికి కారణమని వివరించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఈ ఐదేళ్ల పాలనలో జరిగినంత అభివృద్ధి, సంక్షేమం గతంలో ఎప్పుడైనా చూశారా అని ఉదయభాను ప్రజలను అడిగారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.1245 కోట్లు నియోజకవర్గ ప్రజల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమయ్యాయని వివరించారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.2,400 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.పేట ప్రజల చిరకాల వాంఛ అయిన ప్యాసింజర్ రైలు కోసం 11సార్లు ఢిల్లీ వెళ్లి రూ.1450 కోట్లు మంజూరు చేయించగా, ప్రస్తుతం డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయన్నారు. ముక్త్యాల వద్ద కృష్ణా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.60కోట్లు మంజూరుకాగా, టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. పేట పట్టణంలో రూ.15 కోట్లతో చిల్లకల్లు-జగ్గయ్యపేటకు ఫోర్‌లేన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, రూ కోట్లతో పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి, పేట ప్రభుత్వాస్పత్రిని 25 పడకల నుంచి 50 పడకలకు పెంపు, రూ.3కోట్ల నాబార్డు నిధులతో భవనాల ఆధునీకీకరణ, రూ.1కోటితో అంతర్గత రోడ్లు, రూ.1.50 కోట్లతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, రూ.1కోటితో హైవే బస్టాండ్, రూ.3.50 కోట్లతో టీటీడీ కల్యాణమండపం, రూ.2కోట్లతో పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రచారంలో తొర్రగుంటపాలెం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఉదయభానుతో కలసి విక్టరీ గుర్తు చూపిస్తున్న తొర్రగుంటపాలెం ఓటర్లు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



తిరుమలగిరి(జగ్గయ్యపేట):ప్రముఖ పుణ్య క్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి స్వామివారికి నిర్వహించిన పవళింపుసేవతో ముగిశాయి. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి చతుర్ధశ, మహానివేదన, ద్వాదశ ప్రదక్షిణములు, పవళింపు సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఇన్‌చార్జ్ ఏసీ సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చివరి రోజు భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. మహిళలకు ఆలయ సాంప్రదాయం ప్రకారం పసుపు, కుంకుమ, జాకెట్, పండ్లు, ప్రసాదాలు అందించారు. అద్దాల మండపాన్ని సుగంధ పుష్పాలతో అలంకరించారు. సిబ్బంది వెంకటేశ్వరరావు, రుక్మందరావు, శోభనాద్రి పాల్గొన్నారు.

గోశాలకు దాణా విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల దాణాకు శనివారం నందిగామకు చెందిన చల్లా వెంకటనర్సయ్య, భారతి రూ.27వేలు విలువ కలిగిన 10 క్వింటాళ్ల మినపపొట్టు, 2 క్వింటాళ్ల తవుడు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం. ప్రసాదాలతో సత్కరించారు.

జగనన్న మరోసారి సీఎం కావాలి



సంజీవ్‌నగర్‌లో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



జుజ్జూరులో ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కంచికచర్ల :పేదలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. కంచికచర్లలోని సంజీవ్‌నగర్, అంబేడ్కర్ నగర్‌ల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తర్వాత ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు మహిళలు గుమ్మడికాయతో దిష్టితీయడంతోపాటు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల నుంచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఇదేమన్నా మహానగరమా అభివృద్ధి చేయడానికి అని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొనడం శోచనీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆమెతీరుపై మండిపడ్డారు. ప్రచారంలో సర్పంచి వేల్పుల సునీత, ఆపార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, వార్డు సభ్యులు బర్రె శంకరరావు, నాయకులు బోడపాటి బాబురావు, వేల్పుల శ్రీనివాసరావు, అమర్లపూడి యోహాన్, దేవరకొండ గురవయ్య, దాసరి రాము, చట్టు రవీంద్ర, చట్టి రాజు, మేకల బాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, మంగలపూడి కోటిబాబు, కావాటి రాంబాబు, ఎం.పాండు, గద్దల మహేష్ పాల్గొన్నారు.

ఐదేళ్లుగా మంచే చేస్తున్నాం..

వీరులపాడు: నందిగామ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఐదేళ్లుగా తాము చేస్తున్న కృషిని ప్రజలంతా గమనిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లి, చట్టన్నవరం, చెన్నారావుపాలెం, రంగాపురం, జుజ్జూరు గ్రామాల్లో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన జగన్‌మోహనరావుకు ప్రజలు తీన్‌మార్ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. జుజ్జూరు గ్రామస్తులు ఎమ్మెల్యేకు భారీ గజమాలతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రచారంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు చలమల దుర్గారావు, పత్తిపాటి మల్లికార్జునరావు, రమావత్ కోటి, వైస్ ఎంపీపీలు వేమూరి ఆదాం, షేక్ నాగుల్‌మీరా, రాజీవ్ పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి : ఏసీపీ



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రవికిరణ్



మాగల్లులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హనీష్

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని నందిగామ ఏసీపీ డా.రవికిరణ్ కోరారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని అనిగండ్లపాడులో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అందరూ తప్పక పాటించాలన్నారు. అందరూ కలిసి శాంతియుతంగా ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ పి రాంబాబు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాగల్లులో..

నందిగామ: ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఇన్స్పెక్టర్ హనీష్ సూచించారు. మండలంలోని మాగల్లులో పోలీసులు శనివారం రాత్రి గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు ఇన్‌స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా లభించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

చట్టన్నవరం(వీరులపాడు): మండలంలోని చట్టన్నవరం గ్రామంలో సర్పంచి చలమల దుర్గారావు ఆధ్వర్యంలో 10కుటుంబాలవారు శనివారం టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అరిగెల పుల్లయ్య, నల్లయ్యతోపాటు పార్టీలో చేరిన వారికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పాలన సాగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఉదయభాను గెలుపు కోరుతూ ప్రచారం



వేమవరంలో ప్రచారం చేస్తున్న వీరయ్యచౌదరి, నాయకులు

వత్సవాయి : వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) విజయాన్ని కాంక్షిస్తూ ఆపార్టీ నాయకులు మండలకేంద్రం వత్సవాయి, వేమవరంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మాదాల వీరయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, జిల్లా కార్యదర్శి గాదెల రామారావు, చింతకుంట్ల వెంకటరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవికుమార్, సర్పంచ్‌లు భూక్యా సీతమ్మ, కొట్టె నగేష్, అన్నెపాక ప్రణీత, బాణావతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో..

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): వైఎస్సార్‌సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కోరుతూ మండలంలోని అనిగండ్లపాడులో సర్పంచి బి.జ్యోతిబ్రహ్మం శనివారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, నాయకులు పి.శ్రీనివాసరావు, కోలా రామారావు, దోసపాటి దానయ్య, పాలాది వెంకటరమణ పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: సామినేని ఉదయభాను గెలుపు కోరుతూ మాజీకౌన్సిలర్ సోమవరపు నాగమల్లేశ్వరరావు(బాబు), నాయకులు కోలా గోపాల్, అల్లూరి భాస్కరరావు, షేక్ నాగుల్ మీరా, సుంకర బాబి శనివారం జగ్గయ్యపేటలోని 26వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా ఉదయభానులను గెలిపించాలని ఓటర్లను కోరారు.

సీఎం జగనన్న చేసేదే చెప్పారు

మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గడిచిన ఐదేళ్లలో ఇచ్చిన మాట ప్రకారం చెప్పినవన్నీ అమలు చేసిన సీఎం జగనన్న..ఈసారి కూడా మేనిఫెస్టోలో నెరవేర్చగలిగిన హామీలు మాత్రమే పొందుపరిచారని అభిప్రాయపడ్డారు. ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతారన్న నమ్మకం తమకు ఉందని వారు పేర్కొన్నారు.

పింఛన్ పెంపుపై హర్షం..

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో అవ్వతాతలకు, దివ్యాంగులకు పెన్షన్ కానుకను రూ.3500 పెంచుతానని సీఎం జగనన్న ప్రకటించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ దివ్యాగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందుల కిరణ్‌రాజ్, దివ్యాంగుల విభాగం పేట నియోజకవర్గ నాయకుడు మోదుగు శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యే ఉదయభానును శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోపై హర్షం వ్యక్తంచేస్తున్న పలువురి అభిప్రాయాలు..వారి మాటల్లోనే..



తనను కలిసిన కిరణ్‌రాజ్‌ను అభినందిస్తున్న విప్ ఉదయభాను

డ్రైవర్లకు మేలు..



లారీ, టిప్పర్ డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించడం హర్షణీయం. జగనన్న హామీ ఇస్తే తప్పక నెరవేరుతుందనే నమ్మకం ప్రతి ఒక్కరికీ ఉంది.

– ఉప్పు శివకృష్ణ, పెనుగంచిప్రోలు

సున్నా వడ్డీకే రుణాలు హర్షణీయం..



డ్వాక్రా సంఘాలకు రూ.3లక్షల వరకు సున్నా వడ్డీకే రుణాలు మంజూరు చేస్తామనడం హర్షణీయం. రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతగానో కృషిచేస్తున్నారు. ఆయనకు కృతజ్ఞతలు.

– బండ్ల నాగరత్నం..బలుసుపాడు

మేనిఫెస్టోలో నిజాయితీ ఉంది...



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టో నిజాయితీ ఉంది..గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ జగన్ నిలబెట్టుకున్నారు. ఈసారి కూడా మాట నిలబెట్టుకునేలా మేనిఫెస్టో రూపొందించడం ఆనందంగా ఉంది.

– బందారు శేషు, నందిగామ

చేసేదే చెప్పారు...



చేయగలిగింది మాత్రమే చెప్పి మాట తప్పకుండా అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతుభరోసా కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని పెంచడం మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగం.

– గోగినేని వెంకటేశ్వరరావు, కంచికచర్ల

మేనిఫెస్టో బాగుంది...



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ఆచరణీయంగా ఉంది. అమ్మఒడి, రైతుభరోసా కింద ఇచ్చే నగదును పెంచడం అభినందనీయం. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం.

– తోట శిరీష, న్యాయవాది, జగ్గయ్యపేట.

అందరికీ మేలు ..



సీఎం జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోతో అందరికీ మేలు చేకూరుతుంది..జగన్ మాట ఇచ్చాడంటే తప్పడు.. చంద్రబాబు ఇచ్చిన మాట మీద నిలబడడు. ఇదే ఈ ఇద్దరి నాయకుల మధ్య వ్యత్యాసం.

– పరిమి కిషోర్, నందిగామ

జనమంతా జగన్ వైపే..



మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ఐదేళ్లుగా అమలుచేస్తున్న సీఎం జగన్ వెంటే జనమంతా ఉన్నారు. ఈసారి మేనిఫెస్టో కూడా ప్రజలు మేలు చేసేలా ఉంది. సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం.

– దేవరకొండ గురవయ్య, కంచికచర్ల

వాహనమిత్రతో మేలు..



వాహనమిత్ర ద్వారా ఆటో తదితర వాహనాల డ్రైవర్లకు ఐదేళ్లుగా ఏటా రూ.10వేలు ఆర్థికసాయం అందిస్తుండటం హర్షణీయం. ఈ పథకాన్ని తాజా మేనిఫెస్టోలో కూడా కొనసాగించడం సంతోషంగా ఉంది.

– మాతంగి కెనడీ, జగ్గయ్యపేట